
# మనబడికి నారావారి గ్రహణం

- పూర్తి కావస్తున్న పనులకు మోక్షం ఎన్నడో?
- విద్యార్థులకు తప్పని తిప్పలు

నెల్లూరు (టౌన్): నెల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లోని మనబడి నాడు- నేడు పనులకు నారావారి గ్రహణం పట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు- నేడు కింద అదనపు తరగతి గదులు, ప్రహరీ, టాయ్‌లెట్స్, కుర్చీలు, బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, గ్రీన్‌చాక్‌బోర్డు, ఆర్వో ప్లాంటు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో నెల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లో తొలి విడతలో 82, రెండో విడతలో 150 పాఠశాలలను ఎంపిక చేశారు. తొలి విడతలో ఎంపికై న పాఠశాలల్లో నాడు- నేడు పనులు 90 శాతం పూర్తి కాగా, రెండో విడతలో ఎంపికై న పాఠశాలల్లో నాడు- నేడు పనులు 70 శాతానికి పైగా పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో నాడు- నేడు పనులకు ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయకపోవడం, పేరెంట్స్ అకౌంట్లలో మిగిలిన డబ్బులను ఖర్చు చేయకుండా వదిలివేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో పిల్లలు చెట్లు కింద కూర్చొని చదవాల్సి వస్తుంది. మౌలిక సదుపాయాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి.



జీవీనగర్‌లోని కేఎన్నార్ పాఠశాలలో..

**తొలి విడతలో..**

నెల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లో తొలి విడత నాడు- నేడు పనులకు 82 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం రూ.24.86 లక్షలు అంచనా వేశారు. వీటికి సంబంధించి రూ.14.62 లక్షల నిధులు మంజూరయ్యాయి. తొలి విడతలో 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో 90 శాతం పనులు పూర్తయ్యాయి.

**రెండో విడతలో ..**

నెల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లో రెండో విడతలో 150 పాఠశాలలను ఎంపిక చేశారు. మౌలిక సదుపాయాల కోసం రూ.68.92 లక్షల నిధులు మంజూరు చేశారు. వీటిల్లో రూ.30.55 లక్షలను విడుదల చేశారు. ఈ నిధులకు సంబంధించి 50 శాతం పనులు పూర్తి చేశారు. ఇంకా రూ.10 లక్షలకు పైగా నిధులు ఆయా పేరెంట్స్ అకౌంట్లలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఎక్కడి పనులు అక్కడే ...**

నెల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లో నాడు-నేడు పనులకు ఎంపికైన పాఠశాలల్లో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలను పునః ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు ఇబ్బందులు తప్పేలా లేదు. తరగతి గదులు లేక చెట్ల కింద కూర్చొని చదువుకుంటున్న పరిస్థితి చాలా పాఠశాలల్లో ఉంది.

**పెండింగ్ పనులు పూర్తి చేస్తాం**

> నాడు- నేడు చివరి దశలో ఉన్న పనులు పూర్తి చేస్తాం. పేరెంట్స్ అకౌంట్లలో ఉన్న డబ్బులతో ఆయా పాఠశాలల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
> – వెంకటసుబ్బయ్య, ఏపీసీ, సమగ్రశిక్ష


మూలాపేట ఈఎస్ ఆర్ఎంసీ పాఠశాలలో నిలిచిపోయిన పనులు


స్టోన్‌హౌస్‌పేట బీవీఎస్ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణం



ఫత్తేఖాన్‌పేటలోని మున్సిపల్ హైస్కూల్ అసంపూర్తి భవనాల్లో తిరుగుతున్న విద్యార్థులు

## క్లుప్తంగా

### బాధ్యతగా పనిచేస్తా


సజ్జల రామకృష్ణారెడ్డితో మొయిళ్ల గౌరిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా నియమించినందుకు శక్తివంచన లేకుండా బాధ్యతగా పనిచేస్తానని మొయిళ్ల గౌరిరెడ్డి అన్నారు. నగరానికి విచ్చేసిన వైఎస్సార్‌సీపీ పీఏసీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ స్థాయిల్లో పనిచేశానని, నూతనంగా తనపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నానన్నారు. తనకు అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### పేర్నాటి నేచురల్స్‌ను సందర్శించిన సజ్జల


పేర్నాటి దంపతులతో మాట్లాడుతున్న సజ్జల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరుకు విచ్చేసిన వైఎస్సార్‌సీపీ పీఏసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మాగుంట లేఅవుట్‌లోని పేర్నాటి నేచురల్స్‌ను సందర్శించారు. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సుస్మితారెడ్డి దంపతులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్టోర్‌లోని సేంద్రియ ఉత్పత్తుల గురించి వివరించారు.

### పింఛన్ల పంపిణీ


పెన్షన్ ఇస్తున్న నారాయణ

నెల్లూరు సిటీ: నగరంలోని మూడో డివిజన్ జాఫర్ సాహెబ్ కాలువ గట్టుపై రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ముందుగానే పెన్షన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 12న తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని, అలాగే రైతులకు రూ.20 వేలు అందిస్తామని చెప్పారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నగరాధ్యక్షుడు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

⇒ నెల్లూరు సిటీ: సీఎం సహాయనిధి కింద 27 మంది పేద రోగులకు రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ శనివారం చెక్కులను అందజేశారు. గోమతినగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. అదే విధంగా 141 మందికి కార్యకర్తల సహాయనిధి కింద రూ.25 వేల లెక్కన చెక్కులను అందజేశారు. అలాగే 30 మంది పేదలకు తోపుడు బండ్లు, 10 మందికి ఇస్త్రీ బండ్లు, నలుగురు వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ ఇచ్చారు.

### గౌరవ డాక్టరేట్ ప్రదానం



నెల్లూరు(బృందావనం): 18 ఏళ్లుగా సాహిత్య, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న నెల్లూరుకు చెందిన పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు శనివారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులోని హోసూరులో ఇంటర్నేషనల్ అచీవ్‌మెంట్ అవార్డ్స్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి, రియల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శనివారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు.

### ఆన్‌లైన్ ప్రక్రియలోనే అనుమతులు

- మంత్రి నారాయణ

నెల్లూరు (బారకాసు): రాష్ట్రంలోని 123 నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో బిల్డింగ్ ప్లానింగ్, లేఅవుట్ అనుమతులన్నీ ఆన్‌లైన్ ప్రక్రియలో వేగంగా జరుగుతున్నాయని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో శనివారం రాత్రి మంత్రి టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని డాక్యుమెంట్లు ఉండి అనుమతులు అడిగితే వెంటనే అప్రూవల్ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ గతంలో ఒక బిల్డింగ్ అప్రూవల్ తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. 2014-19లో తానే ఆన్‌లైన్ సిస్టమ్‌ను తీసుకొచ్చానని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ అనుమతులు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. అనుమతులు పొందిన వారు ప్రభుత్వం నిబంధనలు మేరకు కట్టడాలు చేయాలన్నారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ నందన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి

నెల్లూరు (పొగతోట): చౌకదుకాణాల వద్ద రేషన్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, దీనికి సంబంధించి అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి హెచ్చరించారు. నగరంలోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 1వ తేదీ నుంచి చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేయనున్నామన్నారు. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. పారదర్శకంగా రేషన్ పంపిణీ ప్రక్రియ జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి సంబంధించి క్రమం తప్పకుండా అధికారులు చౌకదుకాణాల వద్ద తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తనిఖీల సమయాల్లో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే డీలర్‌ను స్పాట్‌లోనే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 7,21,524 రేషన్ కార్డులు ఉన్నాయని, ఈకేవైసీ పూర్తిచేయని కార్డులను తొలగించామన్నారు. ప్రస్తుతం 6,25,119 మంది రేషన్ కార్డులు లైవ్‌లో ఉన్నాయన్నారు. కార్డుదారులందరికీ చౌకదుకాణాల వద్ద రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు.

### 3న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జూన్ 3వ తేదీన జిల్లా ఫుట్‌బాల్ సబ్ జూనియర్స్, జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలు జరుగనున్నాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 9 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం బి.ఉమాశంకర్ 99498 53555, చంద్రశేఖర్ 94407 42002 నంబర్లను సంప్రదించాలన్నారు.

# మలేరియా నివారణే ధ్యేయం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ సుజాత తదితరులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మలేరియా నివారణే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సూచించారు. నేటి నుంచి ఈ నెలాఖరు వరకు వైద్యశాఖ ఆధ్వర్యంలో జరిగే మలేరియా నివారణ మాసోత్సవాల వాల్‌పోస్టర్లను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులు రాకుండా పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలోని వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రజలు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా అంతం మనతోనే జరగాలనే ధ్యేయంతో అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం పీఓ డాక్టర్ రమేష్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

# నూర్‌బాషా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని పుర మందిరంలో రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను శనివారం అందజేశారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు హాజరై, విద్యార్థులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు సలీం మాట్లాడుతూ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 115 మంది, ఇంటర్‌లో ప్రతిభచాటిన 23 మంది విద్యార్థులకు రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.రెండు వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు అందజేశామన్నారు. అలాగే గతేడాది నీట్ పరీక్షలో 69వ ర్యాంక్ సాధించిన షాహుల్ హమీద్‌తో పాటు వివిధ పరీక్షల్లో రాణించిన విద్యార్థులను ఘనంగా సత్కరించామన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీరు మహమ్మద్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ బాబన్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, యూత్ అధ్యక్షుడు మస్తాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పొగాకు వాడకంతో కేన్సర్


పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు


మాట్లాడుతున్న డాక్టర్ కన్నన్

- డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): చుట్ట, బీడీ, సిగరెట్, పాన్ పరాగ్, మావ, హాన్స్ లాంటి పొగాకు ఉత్పత్తులను వినియోగించడం ద్వారా కేన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి గుప్తాపార్కు, బీఈడీ కళాశాల తదితర ప్రాంతాల్లో ఎన్‌సీడీ, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, నర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ జరిగింది. వైద్యశాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని డీఎంహెచ్‌ఓ ప్రారంభించి, మాట్లాడారు. పొగతాగడం, పొగాకు నమలడం వల్ల ఊపిరితిత్తులు, గుండె దెబ్బతినే ప్రమాదం ఉందని, నరాలు వీక్ అవుతాయన్నారు. అందువల్ల పొగాకు పదార్థాలను ఆపేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని, ప్రజలను చైతన్యం చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) ప్రాజెక్టు అధికారి డాక్టర్ యశ్వంత్, విక్రమసింహపురి యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఉదయశంకర్, ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ బాలబ్రహ్మాచారి, 10 ఆంధ్రా నావెల్, 24 ఆంధ్రా బెటాలియన్ ఆఫీసర్లు నాగేంద్రబాబు, పెంచలయ్య, పలు ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

**ధూమపానంతో ప్రాణాపాయం**

నెల్లూరు(అర్బన్): ధూమపానం, పొగాకు నమలడం ద్వారా ఊపిరితిత్తులు, కిడ్నీలు, గుండె లాంటి ప్రధాన అవయవాలు దెబ్బతిని ప్రాణం పోయే అవకాశాలున్నాయని నారాయణ డెంటల్ హాస్పిటల్ ఓరల్ మెడిసిన్ విభాగపు హెచ్‌ఓడీ డాక్టర్ కన్నన్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని నారాయణ డెంటల్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా బాలురు సైతం పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడటం బాధాకరమన్నారు.

పొగాకు నివారణతో ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాసు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

నెల్లూరు సిటీ: నగరంలోని వీఆర్సీ కళాశాల వద్ద పూర్వ విద్యార్థులు శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని, ప్రారంభించారు.

### హెచ్‌ఐవీ బాధితులకు సరిపడా మందులివ్వాలి

నెల్లూరు(అర్బన్): హెచ్‌ఐవీ బాధితులకు సరిపడా మందులను క్రమం తప్పకుండా అందించాలని జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సంబంధిత డాక్టర్లకు సూచించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులను ప్రేమగా పలకరించి తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. వారికి అందించే సేవల్లో ఏమాత్రం అలసత్వం చూపకూడదని తెలిపారు. హెచ్‌ఐవీ రోగులకు ఎప్పటికప్పుడు స్వచ్ఛంద సంస్థల సభ్యులు కౌన్సెలింగ్ ఇస్తూ వారిని ధైర్యంగా జీవితంలో ముందుకు సాగేలా చూడాలన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ హెచ్‌ఐవీ రహిత నెల్లూరు కోసం కృషి చేద్దామని సూచించారు.

### పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని శనివారం అందజేశారు. దాతలుగా రాఘవేందర్‌శెట్టి, డాక్టర్ దొరస్వామినాయుడు, నాగేశ్వరరావు, జయదేవ్, రాజా రమేష్ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గుండెవ్యాధి నిపుణుడు శ్రీనివాసరాజు, జీవీ రత్నం, అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేందర్‌రెడ్డి, సెక్రటరీ పొన్నం రవిచంద్ర, ట్రెజరర్ గోపినాథ్, డీవీ సుబ్బరాజు, ఖలీల్, రవిచంద్ర, ఖలీల్‌బేగ్, కేఎంకే రెడ్డి, విజయమోహన్‌నాయుడు, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

### బట్వాడిపాళెంలో ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు(బృందావనం): నగరంలోని బట్వాడిపాళెం నిర్మల సౌధలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి పుట్టినరోజు సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో బీపీ, షుగర్, ఈసీజీ, ఎక్స్‌రే, దంత తదితర పరీక్షలను వైద్యులు పి.విజయకుమార్‌రెడ్డి, కిరణ్మయిరెడ్డి నిర్వహించారు. అలాగే వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నిర్మల నరసింహారెడ్డి కేక్ కట్ చేశారు. వేలూరు రంగారావు, హైటెక్ రమణారెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, జీవీ రత్నం, స్నేహ సురేష్, పాబోలు సత్యనారాయణ, సుధాకర్, కస్తూరి లీలామోహన్‌రెడ్డి, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి వినతి


పీడీ లీలారాణికి వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

నెల్లూరు(బారకాసు): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పొదుపు మహిళల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెప్మా ప్రాజెక్ట్ కార్యాలయంలో పీడీ లీలారాణిని కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్ బి, నగర కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పొదుపు మహిళలకు వడ్డీ మాఫీ, రుణమాఫీ అమలు చేయలేదన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలపై అధిక వడ్డీని విధిస్తున్నారని తెలిపారు. బీమా పేరుతో బ్యాంకులు పొదుపు మహిళల వద్ద బలవంతపు వసూళ్లు చేస్తున్నారని వాపోయారు. చనిపోయిన పొదుపు మహిళల రుణాలను రద్దు చేయాలన్నారు. 53, 54 డివిజన్లలో ప్రభుత్వ బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు. ఐద్వా నేతలు ఎన్వీ సుబ్బమ్మ, కె.సంపూర్ణమ్మ, షేక్ సల్మా, షాహిన్, వి.లక్ష్మి, ఐ.వి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన కాలువల పూడికతీత


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): వరద నీరు సాఫీగా పారేందుకు వీలుగా నగరంలోని అన్ని డివిజన్లలో డ్రెయిన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టామని కమిషనర్ నందన్ తెలియజేశారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక నాలుగో డివిజన్ రామ్‌నగర్ ప్రాంతం, 40వ డివిజన్ వాకర్స్ రోడ్డు ప్రాంతంలో కమిషనర్ శనివారం పర్యటించారు. డివిజన్ల పరిధిలో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించి క్రమం తప్పకుండా అన్ని డివిజన్లలో చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలించారు. క్యాంటీన్ ప్రాంగణాన్ని అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.

# భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న యానాది మహానాడు నాయకులు

నెల్లూరురూరల్ : తమ గ్రామంలో భూ కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని యానాది మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు చౌటూరు శీనయ్య అన్నారు. నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిగిరి మండలం జిర్రావారిపాళెం ఎస్టీ కాలనీలో ఇర్ల రమణయ్య అనే వ్యక్తి భూ కబ్జాకు పాల్పడుతుండగా స్థానిక యానాదులు అడ్డుకున్నారని, దీంతో వారిని దూషిస్తూ భయభ్రాంతులకు గురిచేశారన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని వివరించారు. కానీ వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బాధితులపై దాడులకు పాల్పడుతున్న వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో యానాది మహానాడు సంఘం నాయకులు అలేషా, సీహెచ్ శీనమ్మ, ఆర్.రమాదేవి, టి.నాగమణి, కె.లక్ష్మమ్మ, కొండయ్య తదితరులు ఉన్నారు.

# ఆరేళ్ల బాలుడికి అరుదైన ఆపరేషన్


మాట్లాడుతున్న డాక్టర్ సాయిసుబ్రహ్మణ్యం

నెల్లూరు(అర్బన్): పొదలకూరు మండలం అమ్మవారిపాళెనికి చెందిన ఆరేళ్ల బాలుడికి అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేశామని నారాయణ ఆస్పత్రి చిన్న పిల్లల వైద్య నిపుణుడు సాయిసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆస్పత్రిలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పుట్టుకతోనే బాలుడికి మలాశయానికి సమీపంలో ఉన్న కోలన్ భాగంలో నాడీకణాలు లేకపోవడం వల్ల ఆ భాగం చలనం లేకుండా మలవిసర్జనకు అవరోధంగా ఏర్పడిందన్నారు. దీనికి తాత్కాలికంగా చెన్నైలో బాలుడికి లెవలింగ్ కొలెస్టమి అనే ప్రాథమిక చికిత్సను చేశారన్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు తమ ఆస్పత్రికి తీసుకుని రాగా, తాము శాశ్వత పరిష్కారంగా డుహామెల్ రెట్రోరెక్టల్ పుల్-త్రో అనే శస్త్రచికిత్సను విజయవంతంగా చేశామన్నారు. ఇప్పుడు ఈబాలుడికి సాధారణంగానే మలవిసర్జన జరుగుతోందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో బాలుడికి ఎలాంటి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశామన్నారు. సమావేశంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, నియోటాలజిస్ట్ గోకులకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.